క్లుప్తంగా

నేడు కట్టమూరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినప్పటికీ ఎన్నికల హామీలను సక్రమంగా అమలు చేయనందున ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీ ఆదేశాల మేరకు మండలంలోని కట్టమూరు గ్రామంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం తెలిపారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘంటసాల కళాపరిషత్ నాటకోత్సవాలు వాయిదా

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద ఈ నెల 20న నిర్వహించాల్సిన ఘంటసాల కళాపరిషత్ 20వ వార్షిక నాటకోత్సవాలు తుఫాన్ కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఘంటసాల కళాపరిషత్ అధ్యక్షుడు బి.సుబ్బారావు మంగళవారం తెలిపారు. కళాకారులు, కళాభిమానులు, ప్రేక్షకులు గమనించాలని, తిరిగి తదుపరి తేదీని తెలియజేస్తామన్నారు.

పెన్షన్లు రద్దు అయిన వారు అప్పీలు చేసుకోండి

చిలకలూరిపేట: దివ్యాంగుల పెన్షన్లకు సంబంధించి అనర్హులుగా ప్రకటించబడిన వారు, తాము అర్హులని భావించినట్లయితే సంబంధిత పత్రాలతో, సంబంధిత సచివాలయంలో అప్పీలు కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు తెలిపారు. పెన్షన్ తీసుకుంటూ అనర్హులైన లేదా పెన్షన్ రకం మార్పుతో నోటీసులు అందుకున్న పెన్షన్ దారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంబంధిత సచివాలయంలో అప్పీలు కోసం అర్జీ, ఆధార్‌కార్డు జిరాక్స్, పెన్షన్ రద్దు లేదా పెన్షన్ మార్పు నోటీసు, పాత సదరమ్ సర్టిఫికేట్, కొత్త సదరమ్ సర్టిఫికేట్ (పెన్షన్ రకంలో మార్పు జరిగితే) సమర్పించాలన్నారు. అనర్హులుగా నోటీసులు పొందిన 30 రోజుల లోపు సంబంధిత సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ద్వారా అప్పీలు చేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

యడ్లపాడు వద్ద ఘటన



ప్రమాదం సంఘటన స్థలిలో విడిచిన ప్రమాదానికి కారణమైన స్కూటీ

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు సెంట్రింగ్ సామాన్ల లోడుతో వెళ్తున్న ఫోర్‌వీల్ ఆటో యడ్ల పాడు ఎర్రకొండ సమీపంలో ఆగిపోయింది. దీంతో ఆటోలోని ముగ్గురు దిగి ముందుకు తోస్తున్న క్రమంలో అదేమార్గంలో వేగంగా దూసుకువచ్చిన స్కూటీ అదుపుతప్పి వారిలో ఒకరిని ఢీకొంది. దీంతో సదరు వ్యక్తి రోడ్డుపై పడి తలతో పాటు పలుచోట్ల కనిపించని గాయాలయ్యాయి. స్కూటీ నడిపే వ్యక్తి వాహనాన్ని వదిలి పరారయ్యాడు. తీవ్రంగా గాయలైన సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన విన్నకోట వెంకట మోహనరావు (52)ను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్సల అనంతరం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంచార జాతుల సదస్సును విజయవంతం చేయాలి

చిలకలూరిపేట: సంచారజాతుల సదస్సుకు సంబంధిత వర్గాల ప్రజలు భారీగా తరలిరావాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటీషర్ల పాలనలో అనేక రకాలుగా సమస్యలను సంచార జాతుల ప్రజలు అనుభవించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళుతూ స్వతంత్ర్య పోరాట స్ఫూర్తి ప్రజలకు వివరించే వారని వెల్లడించారు. అలాంటి సంచార జాతుల పరిస్థితి నేటికి కూడా దైన్యంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 31వ తేదీన సంచార జాతుల దినోత్సవం ఉన్నందున సంబంధిత జాతుల్లో చైతన్యం నింపేందుకు బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 30 తేదీన విజయవాడలో స్ఫూర్తి అనే సంచార జాతుల సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఓబీసీ నాయకులు అన్నపరెడ్డి లక్ష్మణ్, కుప్పం కల్యాణ దుర్గారావు, గుమ్మా బాలకృష్ణ, ఊటికొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

షాక్ కొడుతున్న బిల్లులు..

చిరు వ్యాపారుల అవస్థలు

- వ్యాపార విద్యుత్ చార్జీలతో పాటుగా అదనపు భారాలు
- ఇంటి బిల్లు, దుకాణాల బిల్లులుతో భారం అంటున్న చిరు వ్యాపారులు
- వ్యాపారాలు చేయలేక దుకాణాలు మూసేస్తున్న వైనం



టైలర్‌షాపు



క్రోసూరులో టైలర్ షాపు, కిరాణా వ్యాపారి విద్యుత్ బిల్లులు

క్రోసూరు: చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే టైలర్లు, కూల్‌డ్రింక్ షాపులు, మెడికల్ షాపులు, బార్బర్ షాపులు, కిరాణా, ఫ్యాన్సీ దుకాణాల నిర్వాహకులు విద్యుత్ చార్జీల అదనపు భారాలు మోయలేక వ్యాపారాలు చేయలేక అవస్థలు పడతున్నారు. మండలంలో క్రోసూరు టౌన్‌తో కలుపుకుని 21 గ్రామాలున్నాయి. వీటిలో సుమారు 200 మంది చిరు వ్యాపారులుంటారు. వీరిలో అనేక మంది చిన్న చిన్న దుకాణాలు నిర్వహించుకునే వారే అధికం. వీరికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సంక్షేమ పథకాలు అందవు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి టైలర్లకు చేదోడు పథకం కింద ఆర్థిక సహాయం, నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల విద్యుత్ సబ్సిడీ అమలు చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అవేమి లేవు. దీంతో వారు ప్రస్తుతం షాక్ కొడుతున్న విద్యుత్ బిల్లులతో వ్యాపారాలు చేయలేక మూసివేస్తున్న పరిస్థితి నెలకొంది.

- విద్యుత్ చార్జీలు కేటగిరి(2) పేరుతో వ్యాపారాలు నిర్వహించే వారికి గృహ విద్యుత్ కంటే అధికంగా చార్జీలు ఉంటాయి. అయితే కూటమి ప్రభుత్వం దుకాణాల విద్యుత్ చార్జీల స్లాబ్ ధరలతో పాటు ఇతర చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో సుమారు రూ.300-400 అదనంగా బిల్లులు వస్తున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంటే 50 యూనిట్లు దాటితే యూనిట్‌కు రూ.7.65 చెల్లించాలి, అంటే కనీసం 50 యూనిట్లు వాడితే రూ.275 చెల్లించాలి. దీంతోపాటు అదనపు చార్జీలు రూ.200 కలిపి రూ.475 బిల్లు వస్తుంది. విద్యుత్ బిల్లులు, దుకాణం అద్దె, అవేకాక ఇంటి కరంట్ బిల్లు చెల్లించలేక చిరు వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు అదనపు, ఫిక్స్‌డ్, కస్టం చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్దుబాటు చార్జీలు కలిపి సుమారు రూ.200-300 అదనంగా వస్తుంది. ప్రభుత్వం విద్యుత్ చార్జీలపై వేస్తున్న అదనపు భారాలు తగ్గించాలని కోరుతున్నారు.

కేటగిరి-2 విద్యుత్ చార్జీలు స్లాబ్ ధరలు ఇలా...

యూనిట్లు	ధర (యూనిట్‌కు రూపాయల్లో)
0-50	5.40
51-100	7.65
101-300	9.05
301-500	9.60
500 పైన	10.15

అవస్థలు పడుతున్నాను



గతంలో నాకు రూ.400 బిల్లు వచ్చేది. ఇప్పుడు రూ.600-700 వస్తుంది. దీంతో పాటు ఇంటి కరెంటు బిల్లు చెల్లించాలి. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టైలర్లకు ఆర్థిక సహాయం అందించారు. ఇప్పుడు అది కూడా లేదు. అవస్థలు పడుతున్నాను.

– షేక్ బాబు, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, క్రోసూరు

దుకాణం మూసేసాం



గతంలో బార్బర్ షాపు నిర్వహించాం. షాపు అద్దె, కరంటు బిల్లులు, ఇంటి నిర్వహణ ఖర్చులు పెరిగిపోయి దుకాణం మూసేసి వేరే షాపుల్లో పనికి వెళ్తున్నాను. గత ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చింది. ఇప్పుడు ఉచితం లేకపోవటంతో అధికంగా వచ్చే బిల్లులు చెల్లించలేకపోతున్నాం. ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులకు విద్యుత్ సబ్సిడీ ఇస్తే ఖర్చులు తగ్గుతాయి.

– పోతుగంటి నాగరాజు, సీపీఐ యువజన విభాగం నాయకుడు, క్రోసూరు

ముగిసిన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



రాజమండ్రి వారిచే నిర్వహించిన బుర్రకథ



సత్యహరిశ్చంద్ర నాటకంలోని సన్నివేశం

రాజుపాలెం: మండల కేంద్రమైన రాజుపాలెంలో వేంచేసి ఉన్న పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం 5వ రోజు ప్రత్యేక పూజలతో ముగిశాయి. ఉదయం మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు నిత్యారాధన, మంగళశాసనం నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. భక్తులు అధిక సఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఐదు రోజులపాటు స్వామి వార్లకు హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించిన వేద పండితులను దేవస్థాన వ్యవస్థాపకులు పొత్తూరి వెంకటరమసుబ్బారావు దంపతులు ఘనంగా సన్మానించారు. మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా రాజమండ్రి వారిచే నిర్వహించిన బుర్రకథ చూపరులను ఆకట్టుకుంది. సోమవారం రాత్రి సత్యహరిశ్చంద్ర పద్య నాటకంలోని కళాకారులు నటులను పలువురు అభినందించారు. మంగళవారం రాత్రి భక్త చింతామణి నాటకం చూపరులను ఆకట్టుకుంది.

ఈ-పంట నమోదు తప్పనిసరి



బాలాజీనగర్ తండాలో వరి నారుమడులను పరిశీలిస్తున్న ఏవో దేవదాసు



లక్కరాజుగార్లపాడులో మాట్లాడుతున్న ఏవో సుబ్బారెడ్డి

నకరికల్లు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న అన్ని రకాల పంటలకు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో కె.దేవదాసు సూచించారు. మండలంలోని గుండ్లపల్లి, బాలాజీనగర్ తండాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అర్హత కలిగి లబ్ధి పొందని రైతులు గ్రీవెన్స్ మాడ్యూల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న పంటలకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ, క్రాప్ ఇన్సూరెన్స్, మద్దతు ధర వర్తిస్తుందన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే సంక్షేమ పథకాలకు ఈ పంట నమోదు తప్పనిసరని అన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు యు.ప్రియదర్శిని, సర్పంచ్ మునిసింగ్‌నాయక్, కరాలపాటి వలి, రైతులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చేపట్టాలి

సత్తెనపల్లి: నల్లరేగడి(బరువు) నేలల్లో సాగు చేసిన పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో బి.సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని లక్కరాజుగార్లపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నల్లరేగడి (బరువు) నేలల్లో విత్తిన పత్తి అధిక వర్షాలకు లోనైతే వెంటనే నీటిని కాలువల ద్వారా బయటకు తీసి వీలైనంత త్వరగా ఎడసేద్యం చేసి భూమి ఆరేటట్లు చేసుకోవాలన్నారు. ఎకరానికి 30 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను అదనంగా వాడుకోవాలన్నారు. ప్రస్తుతం పత్తి పైరులో తామర పురుగు గమనించటం జరిగిందని, దాని నివారణకు ఎసిఫేట్ 350 గ్రా. లేదా ఏసిటామిప్రిడ్ లేదా థైయోమిథాక్సమ్ 40 గ్రా. లేదా పిప్రోనిల్ 400 మి.లీ. 200 లీటర్లు నీటిలో కలిపి 10 రోజులకు మందులను మార్చుతూ పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏవో వేణుగోపాల్

క్రోసూరులో...

క్రోసూరు: రైతులు తాము సాగు చేస్తున్న పంటలను ఈ పంటలో నమోదు చేసుకోవాలని అలా నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఏవో వేణుగోపాల్ అన్నారు. మండలంలోని క్రోసూరు, అందుకూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్ పాల్గొని మాట్లాడుతూ ఖరీఫ్ 2025-26 సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-పంట యాప్ ద్వారా రైతు సేవా కేంద్ర సిబ్బంది నమోదు చేస్తున్నట్లు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పంట నష్టపరిహారం, మద్దతు ధర, వివిధ ప్రభుత్వ రాయితీలు తదితర ప్రయోజనాలు పొందాలంటే తప్పకుండా పంట నమోదు చేసుకోవాలరి తెలిపారు. కౌలు రైతులు పంట సాగుదారు హక్కు పత్రం పొంది పంట నమోదు చేసుకుంటే ప్రయోజనాలు వర్తిస్తాయని అన్నారు. పంట నమోదుకు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలన్నారు. అనంతరం సాగులో ఉన్న పత్తి పంటను పరిశీలించి యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది ఒ.శ్రీనివాసరావు, ఎస్.మన్యానాయక్, రైతులు పాల్గొన్నారు.

గిరిజన తండాలను చుట్టుముట్టిన వరద నీరు



వాగుపై నుంచి నడుము లోతుకు పైగా ప్రవహిస్తున్న నీటిలో వస్తున్న జడపల్లి తండా వాసి



వాగు పై నుంచి బైకును మోసుకుంటూ వస్తున్న యువకులు

అచ్చంపేట: మండల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు 4 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేయడంతో సమీపంలోని కంచుబోడు తండా, జడపల్లి మోటు తండాలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. రెండు తండాలకు మధ్య గల వాగు పొంగి పొర్లుతుండటంతో తండావాసులు తప్పనిసరి పరిస్థితుల్లో నడుము లోతుకుపైగా ప్రవహిస్తున్న వాగు చప్టా పై నుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ముగ్గురు, నలుగురు యువకులు కలసి బైకులను మోసుకుంటూ వాగు పై నుంచి ఇవతలి ఒడ్డుకు వస్తున్నారు. తమ గోడు ఎవ్వరూ వినిపించుకోకపోవడంతో ప్రమాదం అని తెలిసినా తప్పక ప్రయాణిస్తున్నామని వారు చెబుతున్నారు. వాగు వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరి కలుగానీ, పోలీసులను కాపలా ఉంచడం గానీ లేకపోవడంతో గ్రామస్తులు రాకపోకలు కొనసాగిస్తున్నారు.

ఫొటోగ్రాఫర్లకు సత్కారం



సత్కారం అందుకున్న ఫొటోగ్రాఫర్లతో న్యాయవాది విజయ్‌కుమార్

సత్తెనపల్లి: మనిషి మూడో కన్ను కెమెరా.. రెండు కళ్లు చూడలేని ప్రకృతి అందాలు, సామాన్యులు, అణగారిన వర్గాల పోరాటాలు భిన్నమైన సాంస్కృతిక అంశాలను కెమెరా కళ్ల ద్వారా ఫొటోగ్రాఫర్ చూపిస్తాడని అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జొన్నగడ్డ విజయ్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం సత్తెనపల్లి పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఫొటోగ్రాఫర్ల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతికత, ఏఐ టెక్నాలజీ అరచేతిలో ఇమిడిపోయే ఫోన్ వచ్చినప్పటికీ ఫొటోగ్రఫీకి ఆదరణ ఎక్కడా తగ్గలేదన్నారు. కెమెరాకి ముసుగు వేసి తీసిన బ్లాక్ అండ్ వైట్ ఫొటోల నుంచి డిజిటల్ ఫొటోల వరకు కొనసాగడమే ఇందుకు ఉదాహరణనన్నారు. ప్రభుత్వం కూడా ఈ రంగంపై ప్రోత్సాహం అందిస్తూ ఫొటోగ్రాఫర్లు ఉన్నతికి దోహదపడాలన్నారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లు బిట్రా వేదాద్రి, గ్రంధి కోటేశ్వరరావు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతక్రింది సాంబశివరావులను సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు మహంకాళి వెంకట్రావ్, ఫొటోగ్రాఫర్లు మారెళ్ళ చిరంజీవి, బిట్ర నారాయణ, చింతగింజల శ్రీనివాసరావు, షేక్ సుభాని, శ్రీనివాసరావు, మణికంఠ, రాయల్ స్టూడియో సాగర్, కొరవండి రాబర్ట్, నరసింహారావు పాల్గొన్నారు.

వీఏఏలు ప్రకృతి వ్యవసాయంలో భాగస్వామ్యం కావాలి



శిక్షణా కార్యక్రమంలో జిల్లా రిసోర్స్‌పర్సన్ రామచంద్రరావు, ఏవో శ్రీధర్‌రెడ్డి

నార్నెపాడు(ముప్పాళ్ళ): ప్రకృతి వ్యవసాయంలో వీఏఏలు భాగస్వాములు కావాలని జిల్లా రిసోర్స్ పర్సన్ కంచర్ల రామచంద్రరావు చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో ముప్పాళ్ళ, సత్తెనపల్లి, పెదకూరపాడు మండలాల వీఏఏలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ, సాగు చేసే పంటల పరిశీలన మంగళవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న రామచంద్రరావు మాట్లాడుతూ నిరంతర ఆదాయం వచ్చే ఏటీఎం మోడల్‌ను సందర్శించారు. ఏటీఎం మోడల్ సాగులో 4 అడుగులకు ఒక బెడ్ తయారు చేసుకొని, ఒక కాలువ నిర్మించుకొని 15 నుంచి 20 రకాల తీగ, దుంపజాతి, ఆకుకూరలు వేసుకోవాలన్నారు. భూమి ఎప్పుడూ ఖాళీగా ఉండకుండా మొక్కలతో నిండి ఉండేలా చూసుకుంటే రైతులకు నిరంతర ఆదాయం వస్తుందన్నారు. ఏవో ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) ప్రధాన పంటకు ముందు పచ్చి రొట్టపైరుగా 30 రకాల విత్తనాలు పొలంలో వెదజల్లుకోవటం వలన భూమి సారవంతమై కర్బన శాతం పెరుగుతుందన్నారు. జిల్లా అడిషినల్ డీపీఎం ప్రేమరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం తొమ్మిది సూత్రాల మీద ఆధారపడి ఉంటుందని, వాటిని రైతు సేవా కేంద్రం సిబ్బందికి వివరించారు. జీవామృతం వాడే విధానంపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఎన్ఎఫ్ఏ నందకుమార్, మాస్టర్ ట్రైనర్ మధుబాబు, జిల్లా డీపీపీ భవానిరాజ్, పూజ, సౌజన్య, మెంటార్స్, రైతులు, యూనిట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

జిల్లా ఖో ఖో జట్టుకు నకరికల్లు విద్యార్థులు




నకరికల్లు: జిల్లా స్థాయి ఖో ఖో జట్టులో తమ పాఠశాల విద్యార్థులు స్థానం సంపాదించినట్లు నకరికల్లు ఉన్నత పాఠశాల పీడీ జి.ఝాన్సీ రాణి మంగళవారం తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29వ తేదీన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఖో ఖో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో బాలుర జట్టుకు షేక్ నబి రసూల్, బాలికల జట్టుకు డి.రంగమహాలక్ష్మి, పి.షాహినా, సీహెచ్ విజయ, బి.కావ్య ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు 20వ తేదీ నుంచి 22 వరకు నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులను ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ కాసా మల్లిఖార్జునరావు, పీడీ చింతా పుల్లయ్య తదితరులు అభినందించారు.

ప్రముఖ పురుగు మందుల వ్యాపారి మృతి



సత్తెనపల్లి: ప్రముఖ ఎరువులు, పురుగుమందుల వ్యాపారి దూపగుంట్ల సుధాకర్ (48) మంగళవారం మృతి చెందాడు. పట్టణంలోని తన గృహం నుంచి ఉదయం బయటికి వస్తూ కాలుజారి పడిపోవడంతో వెంటనే మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఈ లోపే ప్రాణాలు పోయినట్లు వైద్యులు నిర్ధారించారు. పట్టణంలోని గడియార స్తంభం మూల మీద తిరుమల ట్రేడర్స్ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తూ సుధాకర్ సత్తెనపల్లి చుట్టుపక్కల పలువురికి పరిచయస్తుడు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, ఎరువులు పురుగుమందుల వ్యాపారులు, రైతులు, మిత్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ



సత్తెనపల్లి: వేణుగోపాలస్వామి ఆలయంలో చోరీ జరిగిన ఘటన పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయంలోకి గుర్తు తెలియని దుండగులు కల్యాణ మండపం గుండా గోడ దూకి లోపలికి ప్రవేశించారు. ఆలయంలోని సీసీ ఫుటేజ్‌కు సంబంధించిన వైర్లు కట్ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కానుకల హుండీ పగలగొట్టి కానుకలను అపహరించుకుపోయారు. సుమారు రూ.15 వేలకు పైనే నగదు ఉండే అవకాశం ఉన్నట్లు అంచనా. దేవదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సరిమెళ్ళ కోటిరెడ్డి పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆలయాన్ని సందర్శించారు. క్లూ స్ టీం, వేలిముద్రల నిపుణులు ఆలయానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసు లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బార్లకు దరఖాస్తులు ఆహ్వానం



మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్, పక్కన ఎస్ఐ నాగలక్ష్మి

- దరఖాస్తుకు ఈ నెల 26 వరకు అవకాశం
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్

సత్తెనపల్లి: మద్యం బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సీఐ పి.విజయ్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో మద్యం వ్యాపారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2025-28 నూతన బార్ పాలసీ ప్రకటించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ బార్ పాలసీ 3 సంవత్సరాలు అమల్లో ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 26 చివరి తేదీగా నిర్ణయించడమైందని, ఎంపిక లాటరీ విధానం ద్వారా 28న నరసరావుపేటలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.అరుణ్‌కుమార్ చేతులమీదుగా జరుగుతుందన్నారు. నూతన బార్ పాలసీ ప్రకారం నాన్ రిఫండబుల్ దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు చెల్లించాలన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా వేసుకోవచ్చని, ఎన్ని బార్ లైసెన్సులైనా పొందవచ్చన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రిడ్ మూడు విధానాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆఫ్‌లైన్ దరఖాస్తులను నరసరావుపేట ప్రకాష్ నగర్‌లోని టౌన్‌హాల్లో కౌంటర్ వద్ద అందించాలన్నారు. సత్తెనపల్లి మున్సిపాలిటీలో ఓపెన్ కేటగిరీలో 4 బార్లు ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, అదనంగా మరొకటి గీత కులాల వారికి కేటాయించడం జరిగిందన్నారు. రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్, లైసెన్స్ ఫీజు సంవత్సరానికి రూ.55 లక్షలని, ప్రతి సంవత్సరం ట్యాక్స్ 10 శాతం పెరుగుతుందని, బార్లు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు నిర్వహించుకోవచ్చని, లాటరీ పొందిన వ్యక్తి రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను ఆరు వాయిదాలలో చెల్లించవచ్చన్నారు. బార్ లైసెన్స్ పొందిన 30 రోజుల్లోగా ఒక వాయిదా మొత్తాన్ని బ్యాంకు గ్యారంటీగా అందజేయాలని, రెస్టారెంట్ ఏర్పాటుకు లైసెన్సును మున్సిపాలిటీ నుంచి పొందాలన్నారు. బార్ ఏర్పాటుకు కనీసం 150 చ.మీ. కార్పెట్ ఏరియా ఉండాలన్నారు. మరింత సమాచారం కొరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సత్తెనపల్లి సర్కిల్ స్టేషన్ 76749 22228, 77028 77036 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో ఎస్ఐ కె.నాగలక్ష్మి, మద్యం వ్యాపారులు తదితరులు ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

99122 25439 (సత్తెనపల్లి)
90100 01840 (పెదకూరపాడు)

Office mail : sakshigntadvt@gmail.com